సాక్షి
కర్నూలు
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



నేటి నుంచి 'వాస్కోడిగామ'

కర్నూలు (సెంట్రల్): సికింద్రాబాద్, వాస్కోడిగామ మధ్య మరో రైలు అందుబాటులోకి వచ్చింది. ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి, గురు, శని వారాల్లో వాస్కోడిగామ నుంచి బయలుదేరుతుంది.



ఆకట్టుకున్న కథక్ నృత్యం

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాల్లో శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన వల్లీరావు, బృందం వారి కథక్ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



మద్దిలేటయ్యకు భక్తుల రద్దీ

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో క్షేత్రానికి రూ.4,13,495 ఆదాయం వచ్చింది.

టమాట రైతు బాగుపడిన రోజులకంటే, నష్టపోవడమే అధికం. మార్కెట్‌లో కిలోల లెక్కన ధర మెరిసినా.. పొలాల్లో పండిన పంటను అమ్ముకుంటే రైతు కొచ్చేది అరకొర పైసలే. ఎంతో ఆశతో విక్రయానికి మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు దొరికినంతా దోచేస్తారు. కనీసం రవాణా చార్జీలు కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో ఎక్కడికక్కడ పారబోసి వెళ్లిన ఘటనలు కోకొల్లలు. ఇప్పుడు కూడా పత్తికొండ మార్కెట్‌లో టమాట రైతు నిలువుదోపిడీకి గురవుతున్నా స్పందించే అధికారులే కరువయ్యారు. రైతులకు వచ్చేది గోరంత కాగా.. వ్యాపారులు మాత్రం లక్షలు మూటకట్టుకోవడం గమనార్హం.


పత్తికొండ మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన టమాట

రైతుల ఆశలు మురిగి.. వ్యాపారులు లాభాలు మరిగి!

దిక్కుతోచని టమాట రైతు
- పత్తికొండ మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం
- బుట్ట కొనుగోలు చేసేది రూ.1000 నుంచి రూ.1050లకు..
- రైతులకు బిల్లు రాసేది రూ.800 నుంచి రూ.850
- పది బుట్టలకు రెండు బుట్టలు ఫ్రీగా ఇవ్వాల్సిందే
- వందకు రూ.10 కమీషన్ తప్పనిసరి

పత్తికొండ(ఆళ్లగడ్డ): పత్తికొండ సబ్‌డివిజన్ వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగునీటి ఆధారంగా సుమారు 150 హెక్టార్లు, వర్షాధారంగా సుమారు 120 హెక్టార్లలో టమాట సాగైంది. రోజుకు సగటున 100 నుంచి 110 టన్నుల దిగుబడి వస్తున్నట్లు అంచనా. సమీపంలోని మార్కెట్‌లకు, స్థానిక అవసరాలకు సొంతంగా విక్రయించుకోవడం పోను పత్తికొండ మార్కెట్‌కు రోజుకు 50 నుంచి 60 టన్నుల టమాట వస్తుంది. చుట్టుపక్కల జిల్లాల్లోని మార్కెట్ ధర చూసి సంతోషపడిన రైతులు ఇక్కడికి చేరుకోవడంతో నిరాశ మిగులుతోంది. ప్రస్తుతం కనిష్ట ధర క్వింటా రూ.3వేలు, గరిష్ట ధర క్వింటా రూ.5వేలు నిర్ణయించినప్పటికీ.. ఇక్కడి వ్యాపారులు గరిష్ట ధర క్వింటా రూ.2,500 దాటకుండా కొనుగోలు చేస్తున్నారంటే ఏ స్థాయిలో దోచుకుంటున్నారో అర్థమవుతోంది. పక్కనున్న మదనపల్లెలో కనిష్ట ధర క్వింటాకు రూ.8,200 ఉండగా గరిష్ట ధర క్వింటాకు రూ.8,800.. మోడల్ ధర రూ.8,600 పలుకుతోంది. ఈ లెక్కన కిలో ధర రూ.90 వరకు ఉంటోంది. పత్తికొండ మార్కెట్‌లో మాత్రం గరిష్ట ధరే కిలో రూ.30 దాటకపోవడం గమనార్హం.

10 గంపల్లో 2 నొక్కేస్తారు!

ఏ మార్కెట్‌లో అయినా, ఏ సరుకైనా ఎన్ని బస్తాలు, బుట్టలు తీసుకెళ్తామో అన్నీ లెక్క పెట్టి తూకం వేసి రైతులకు డబ్బులివ్వడం చూసుంటాం. పత్తికొండ టమోట మార్కెట్‌లోనూ రైతులు తెచ్చిన బుట్టలన్నీ లెక్కించి కొనుగోలు చేస్తారు. లెక్క కట్టి చీటీ(బిల్లు) రాసిచ్చే సమయంలో 10 బుట్టలకు 2 బుట్టలు చొప్పున తీసేసి లెక్క కడతారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే నీ సరుకుకు ఇదే ఎక్కువని దబాయిస్తారు. పక్కనున్న వ్యాపారి దగ్గరకు పోదామంటే అక్కడా అంతే. అందరిదీ ఒకటే మాట, ఒకటే పార్టీ కాబట్టి చేసేది లేక ఇచ్చిన కాడికి తీసుకెళ్లాల్సిన దుస్థితి. గట్టిగా నిలదీస్తే మరుసటి రోజు అతని సరుకు ఎవరూ అక్కడ కొనరు. దీనికి తోడు కొనే సమయంలో బుట్ట రూ.1000, రూ.1,050 అని గట్టిగా అరుస్తూ కొనుగోలు చేసి లెక్క రాసుకుంటారు. అంతా అయిపోయి బిల్లులు వేసే సమయంలో ఒక్కో బుట్టకు రూ.800, రూ.850 చొప్పున బిల్లు వేయడం పరిపాటిగా మారింది.

రైతులను పీల్చి పిప్పి చేస్తున్నారు



నేను 1.50 ఎకరాల్లో టమాట పంట వేశా. ఇప్పుడున్న ధరలను బట్టి ఎంత లేదన్నా ఖర్చులన్నీ పోను సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వస్తుందనుకున్నా. పత్తికొండ మార్కెట్ తీసుకొస్తే అంతా వ్యాపారులు దోచుకోవడానికే సరిపోయింది. 5 బుట్టలకు 1 బుట్ట ఫ్రీగా ఇవ్వాలి. ధర రూ.1000కి తీసుకుంటారు, రాసేప్పుడు రూ.200 తగ్గించి రూ.800లే అంటారు. చివరకు మాకు ఇచ్చే లెక్కలో కూడా రూ.100కు రూ.10 కమీషన్ పట్టుకుంటారు. మార్కెట్‌కు బుట్ట తీసుకురావడానికి రూ.25 లగేజీ. ఇలా అన్నీ పోను రూ.70 వేలు కూడా మిగల్లేదు. రైతులను పీల్చి పిప్పి చేస్తుంటే ఎట్లా బతికేది.
– లక్ష్మీనరసయ్య, టమాట రైతు, బొందిమడుగుల

వ్యాపారులంతా కుమ్మక్కే



టమాటా పండించి మార్కెట్‌కు తెచ్చేవరకే మాకు వాటిపైన హక్కు. ఇక్కడికి వచ్చినాక వ్యాపారులు ఎలా చెబితే అలానే. అందరూ ఒకే మాటపై ఉంటారు. ఒకరి దగ్గర గొడవపడ్డామంటే మిగతా వాళ్లు ఎవరూ మా సరుకు కొనరు. ఏం చేస్తాం, అందుకే వారు ఎంత చెబితే అంత ధరకు తెగనమ్ముతున్నాం.
– మహేష్, టమాట రైతు, చిన్నహల్లి

రూ 100కు రూ.10 కమీషన్

రైతుకు ఇచ్చే సొమ్ములోనూ వ్యాపారులు రూ.100కు రూ.10 కమీషన్ నొక్కుతున్నారు. పత్తికొండ మార్కెట్‌లో రోజుకు 60 టన్నులు విక్రయించినా సుమారు రూ.2 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ఈ లెక్కన దళారులు కేవలం కమీషన్ కిందనే రోజుకు రూ.20 లక్షల మేర దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇది కాక 10 గంపలకు 2 గంపలు ఫ్రీ.. రూ.1000లకు రూ.200 తగ్గించి లెక్కగట్టడం, ఇలా అన్నీ కలుపుకుంటే ఎంత లేదన్నా రోజుకు రూ.40 లక్షలకు పైగానే దళారులు దోచుకుంటున్నారు. అయితే ఇందులో అధికార పార్టీ నేతకు ఇచ్చేది ఎంత.. అధికారులకు పంచేది ఎంత అన్నది దేవునికెరుక.

విచారించి చర్యలు తీసుకుంటాం



రైతులు తెచ్చిన సరుకులో ఏదైనా పుచ్చులు, మచ్చలు ఉన్న వాటిని మాత్రమే 10 గంపలకు రెండు గంపలు తీసేసి లెక్క రాసుకుంటారు అనుకుంటా. రూ.1000 అని చెప్పి రూ.800 ఇస్తున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. అలాంటిదేమైనా ఉంటే విచారణ చేస్తాం. రైతులకు ఇబ్బంది కలిగించే వ్యాపారులు, దళారీలపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– కార్నేలిస్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ

కిలో రూ.100

కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధర పెరిగి వినియోగదారులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. మార్కెట్‌లోకి టమాట సరఫరా 50 శాతం వరకు తగ్గిపోయింది. అంతంతమాత్రం దిగుబడులు దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతుండటంతో స్థానికంగా కొరత తీవ్రమవుతోంది. వైఎస్సార్‌సీపీ పాలనలో టమాట ధరలు పెరిగినప్పుడు సబ్సిడీపై కిలో రూ.50 ప్రకారం వినియోగదారులకు పంపిణీ చేసింది. నేడు టమాట ధర కిలో రూ.100కు చేరింది. రైతుబజార్లలో బోర్డుపై ధర కాస్త తక్కువగా ఉన్నా.. టమాట కనిపించని పరిస్థితి. ఒకరిద్దరు తెచ్చినా నాణ్యత ఉండటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఏడాది ఇదే సమయంలో కిలో రూ.10 మాత్రమే ఉంది. ఈ సారి మాత్రం టమాట వినియోగదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.

6,698 ఎకరాల్లోనే టమాట సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఈ–క్రాప్ ప్రకారం 6,698 ఎకరాల్లో టమాట సాగయింది. 2023 ఖరీఫ్‌తో పోలిస్తే సాగు తగ్గింది. దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. కర్నూలు కూరగాయల మార్కెట్‌కు 10 రోజుల క్రితం వరకు రోజుకు 1200 బాక్స్‌ల వరకు వచ్చేది. రెండు, మూడు రోజులుగా 200 నుంచి 400 బాక్స్‌లకు పడిపోయింది. 25 కిలోల బాక్స్ ధర నాణ్యతను బట్టి రూ.660 నుంచి రూ.1,300 పలుకుతోంది.

న్యూస్‌రీల్

పెద్దాసుపత్రిలో ఓపీ మానిటరింగ్ కమిటీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలో తనతో పాటు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, యురాలజీ హెచ్‌వోడి డాక్టర్ కె.సీతారామయ్య, సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ నాగేశ్వరరావు, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు ఉంటారన్నారు. వీరు ఆయా విభాగాలకు సంబంధించి ప్రతి రోజు ఓపీ సేవలను పర్యవేక్షిస్తారన్నారు. ఓపీ విధుల్లో తక్కువ పనితీరు కనపరిచిన వారిపై చర్యలకు కమిటీ సిఫారసు చేస్తుందన్నారు. ఈ మేరకు ప్రతి నెలా 5లోగా కమిటీ సభ్యులు డీఎంఈకి నివేదికలు పంపుతారని పేర్కొన్నారు.

డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి బదిలీ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆయనను రిలీవ్ చేశారు. గత నెల 22న బదిలీ ఉత్తర్వులు వచ్చినా సీఎం పర్యటనతో పాటు వివిధ కారణాల వల్ల ఈ నెల 5 వరకు ఆయనను కొనసాగించారు. శనివారం సాయంత్రం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈయన డ్వామా పీడీగా నాలుగున్నరేళ్ల పాటు పనిచేశారు. డ్వామాలో వాటర్‌షెడ్స్ అదనపు పీడీగా పనిచేస్తున్న మాధవీలతను కలెక్టర్ ఇన్‌చార్జ్ పీడీగా నియమించారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. కాగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా జి.శివ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన పంచాయతీ రాజ్‌లో డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి(డీఎల్‌డీవో). ప్రస్తుతం పల్నాడు జిల్లా నీటియాజమాన్య సంస్థ ఏపీవో(ఎం అండ్ ఇ)గా విధులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఆయన ఇక్కడ పీడీగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉర్దూ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ తెలిపారు. కన్వీనర్ కోటాలో పరిమిత సంఖ్యలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌లకు వర్సిటీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్స్‌ను పొందిన వారికి సైతం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఫీజు రీయింబర్స్ మెంట్ సౌకర్యం వర్తిస్తుందన్నారు.

రేపటి నుంచి వర్సిటీలకు దసరా సెలవులు

కర్నూలు కల్చరల్: దసరా పండుగను పురస్కరించుకొని జిల్లాలోని యూనివర్సిటీలకు సెలవులు ప్రకటించారు. రాయలసీమ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలకు ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు ఆయా వర్సిటీల రిజిస్ట్రార్లు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వి.లోకనాథ తెలిపారు. 14వ తేదీ తిరిగి పునఃప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన గూడ్స్


పాణ్యం రైల్వే స్టేషన్‌లో నిలిచిన రైలు, గూడ్స్

పాణ్యం: పాణ్యం – కృష్ణమ్మ కోన రైల్వే మార్గంలో శనివారం ఉదయం సాంకేతిక సమస్యతో ఓ గూడ్స్ మార్గమధ్యలోనే నిలిచిపోయింది. ఉదయం 6 గంటల సమయంలో పాణ్యం రైల్వే స్టేషన్ నుంచి డోన్‌కు బయలుదేరిన గూడ్స్ కృష్ణమ్మకోన రైల్వే స్టేషన్ చేరుకోకముందే సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. దీంతో రైళ్ల రాకపోకలు దాదాపు 2 గంటల పాటు ఆలస్యమయ్యాయి. నంద్యాల నుంచి కర్నూలుకు బయలుదేరిన డెమూ రైలు పాణ్యంకు 6.45 గంటలకు వచ్చి అక్కడే నిలిచిపోయింది. మరో గూడ్స్‌కు పాణ్యం స్టేషన్‌లో ఉండిపోయింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు అదనపు ఇంజిన్ల సహాయంతో నిలిచిపోయిన గూడ్స్‌ను కృష్ణమ్మకోన స్టేషన్‌కు చేర్చడంతో మిగతా రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. పాణ్యం రైల్వే స్టేషన్ నుంచి డెమో రైలు 8.50గంటలకు బయలుదేరింది. గూడ్స్ ఇంజిన్‌లో సాంకేతిక సమస్యతోనే నిలిచిపోయిందని పాణ్యం రైల్వే స్టేషన్ మాస్టర్ మిథున్‌కుమార్ తెలిపారు.

యుద్ధోన్ముఖీ.. పాహిమాం!


స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

- చంద్రఘంటా అలంకారంలో శ్రీశైల భ్రామరీ
- రావణవాహనంపై భూకైలాసనాథుడు
- శ్రీగిరిలో ఆధ్యాత్మికభరితంగా సాగుతున్న దసరా మహోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆధ్యాత్మిక భరితంగా సాగుతున్నాయి. దసరా మహోత్సవాల్లో మూడవరోజు శనివారం శ్రీశైల భ్రమరాంబాదేవి చంద్రఘంటా అలంకారంలో దర్శనమిచ్చారు. సింహవాహనాన్ని అధిష్టించిన అమ్మవారు పద్మం, బాణం, ధనుస్సు, అభయహస్తం, జపమాల, త్రిశూలం, గద, ఖడ్గం, పంచముద్ర కమండలం ధరించి యుద్ధోన్ముఖురాలై భక్తులకు దర్శనమిచ్చారు. దుష్ట రాక్షస సంహారం కోసం ప్రచండ రూపాన్ని ధరించే అమ్మవారు కార్యరూపిణిగా చంద్రఘంట స్వరూపంలో భక్తులను కటాక్షిస్తారు. అమ్మవారి మస్తకంపై అర్ధచంద్రుడు అలరాడుతున్న కారణంగా ఈ దేవిని చంద్రఘంటాదేవిగా పిలుస్తారు. అమ్మవారి ఆలయం వద్దగల ప్రత్యేక వేదికలో అర్చకులు, వేదపండితులు చంద్రఘంట అలంకీకృత అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. వాహనసేవల్లో భాగంగా రావణవాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రావణ వాహనంపై ఉంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక హారతులిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం చంద్రఘంటా అమ్మవారిని, రావణవాహనా. దీశులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం కనులపండువగా సాగింది. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళంలో 58.4 మి.మీ వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో చిప్పగిరి, పెద్ద కడుబూరు మండలాలు మినహా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం 4 నుంచి 7 గంటల వరకు ఉరుములు, మెరుపులతో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కౌతాళంలో 58.4 మి.మీ, అత్యల్పంగా కోడుమూరులో 0.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంగా సగటున 17.4 మి.మీ వర్షం కురిసింది. అక్టోబర్ నెల మొదటి ఐదు రోజుల్లో 33.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం ఉల్లి కోతలు చురుగ్గా జరుగుతున్నాయి. వర్షాల వల్ల ఉల్లి పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. పత్తి కోతలు కూడా జోరందుకున్న సమయంలో తడిచిపోయి నాణ్యత తగ్గుతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

మండలం	వర్షపాతం(మి.మీ)
హొళగుంద	46.2
ఆదోని	38.8
వెల్దుర్తి	37.4
ఆలూరు	28.4
కర్నూలు అర్బన్	20.4
మద్దికెర	20
కృష్ణగిరి	19.4
కర్నూలు రూరల్	19


వెల్దుర్తి సమీపంలో ఉప్పొంగిన వాగు

బన్ని ఉత్సవంలో రక్త పాతమొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

- అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారమివ్వొద్దు
- దేవరగట్టు సమన్వయ కమిటీ సమావేశంలో ఎస్పీ బిందుమాధవ్

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాన్ని భక్తులు రక్తపాతం లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. శనివారం జేసీ నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజతో కలిసి దేవరగట్టులో ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవరగట్టుకు చేరుకున్న వారు కొండపై వెలిసిన మాళ మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలనంతరం ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ దేవరగట్టు ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా అందరూ సహకరించాలన్నారు. సమావేశానికి హాజరైన ఉత్సవ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు, భక్తులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాలకు భారీ బందోబస్తుతో పాటు 100 సీసీ కెమెరాలు, 5 డ్రోన్ కెమెరాలతో పకడ్బందీ నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు.


దేవరగట్టు పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

దాడులకు పాల్పడితే దొరికిపోతారు..

బన్ని రోజు రాత్రి జరిగే వేడుకల్లో గుంపులో ఉన్నామని ఏమ్ చేసినా.. ఎవరూ చూడరని దాడులకు పాల్పడితే దొరికిపోతారని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ హెచ్చరించారు. అడుగడుగునా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ నెల 12న మాళ మల్లేశ్వరస్వామి కల్యాణం, బన్ని ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు అవసరమైన వసతి ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంప్రదాయాలతో పాటు చట్టాలను కూడా గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు, తహసీల్దారు ప్రసాద్‌రాజు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

'మందు'చూపు

- బార్ అండ్ రెస్టారెంట్లలో నిలువు దోపిడీ!
- నిర్వాహకులతో కుమ్మక్కైన ఎక్సైజ్ అధికారులు
- ప్రభుత్వ దుకాణాలకు మద్యం కేటాయింపుల్లో కోత
- నూతన మద్యం పాలసీ అమలుకు గడువు ఉండగానే దందా మొదలు
- మందు బాబులపై అధిక భారం



కర్నూలు: నూతన మద్యం పాలసీ అమలుకు మరో వారం రోజులు గడువు ఉండగానే బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు దోపిడీకి తెర లేపారు. ఈనెల 12 నుంచి రిటైల్ దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. అప్పటి వరకు రోజువారి అమ్మకం డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ దుకాణాలకు మద్యం కేటాయించాల్సి ఉంది. అయితే, ఎక్సైజ్ అధికారులు బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో కుమ్మక్కై ప్రభుత్వ దుకాణాలకు రేషన్ పద్ధతిలో సరఫరా చేసి ఎక్కువ మోతాదులో బార్లకు మద్యం చేరవేస్తూ వ్యాపారులకు సహకరిస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

సరుకు సరఫరా కోతతో దుకాణాలు వెలవెల...

ప్రభుత్వ దుకాణాలకు అమ్మకం డిమాండ్‌కు అనుగుణంగా మద్యం కేటాయించకుండా తగ్గించేయడంతో జిల్లాలోని ప్రభుత్వ దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 204 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. అన్ని దుకాణాలు కూడా రోజువారీ ఆదాయం 60 శాతానికి పైగా పడిపోయింది. ఈ పరిస్థితులను బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రీమియం బ్రాండ్లు ఇంపీరియల్ బ్లూ, మ్యాక్‌డోవెల్ విస్కీ, రాయల్‌స్టాగ్, బ్లెండర్స్ ప్రైడ్ తదితర బ్రాండ్ల మద్యం డిపోలో కావలసినంత నిల్వ ఉంది. ఆయా బ్రాండ్ల మద్యం ప్రభుత్వ దుకాణాలకు ఇవ్వకుండా బార్ అండ్ రెస్టారెంట్లకు సరఫరా చేస్తూ ఒప్పందం మేరకు అధికారులు సహకరిస్తున్నారు. బార్ యాజమాన్యాలు ప్రీమియం బ్రాండ్ల మద్యం క్వార్టర్ సీసా రూ.130 నుంచి రూ.150 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇలా ఉంటే నూతన మద్యం విధానం అమలులో బిజీగా ఉన్నామంటూ సాకులు చెబుతూ తనిఖీలకు వెళ్లకుండా పరోక్షంగా వ్యాపారులకు సహకరిస్తున్నారు. ప్రైవేటు దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తి చేసి ఈనెల 12న కొత్త దుకాణాలకు లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. ప్రభుత్వ దుకాణాలకు మద్యం సరఫరాలో అధికారులు కోత విధించడంతో నగర, పట్టణ ప్రాంతాల్లో బార్లు కిటకిటలాడుతుంటే మద్యం దుకాణాలు మాత్రం వెలవెలబోతున్నాయి. రేషన్ పద్ధతిన సరఫరా అమలు చేస్తున్నందున దుకాణాల్లో గంటల వ్యవధిలోనే నిల్వలు అయిపోతున్నాయి. కొన్ని చోట్ల ఆలస్యంగా దుకాణాలు తెరవడం, రాత్రి ముందుగానే కట్టేస్తుండటంతో మందుబాబులు బార్లకు వరుస కట్టారు. అక్కడ అధిక ధరలకు కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందని వాపోతున్నారు.

మందుబాబులపై అధిక భారం

కొత్త పాలసీ అమలయ్యేవరకు మందుబాబులకు 'కొరత కష్టాలు', అధిక భారం తప్పేలా లేదు. గత నెల 30 నాటికి ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఉద్యోగ ఒప్పందం గడువు ముగిసింది. దీంతో దుకాణాల నిర్వహణకు వారు చేతులెత్తేశారు. ఇకపై తమ ఉద్యోగాలు ఉండవనే నిరుత్సాహం, ప్రైవేటు మద్యం దుకాణాలు వచ్చేవరకు మేన మెందుకు పనిచేయాలనే ధోరణితో చాలా మంది విధులకు గైర్హాజరవుతున్నారు. దుకాణాల్లో పనిచేసే వారిని రాకుండా చేసి వ్యాపారం మందగించేలా చేసి పరోక్షంగా బార్ల నిర్వాహకులకు ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కొత్త దుకాణాలు వచ్చే వరకు బార్ అండ్ రెస్టారెంట్లలో దోపిడీ కొనసాగనుంది.

క్లుప్తంగా

కర్నూలు మార్కెట్‌లో ధరలు పతనం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లితో పాటు వివిధ పంటల ధరలు తగ్గిపోయాయి. మార్కెట్‌కు శనివారం 395 మంది రైతులు 11,150 క్వింటాళ్ల ఉల్లి తీసుకొచ్చారు. గరిష్ట ధర రూ.3969 ఉండగా.. సగటు ధర రూ. 2468 మాత్రమే నమోదైంది. వ్యాపారులు సిండికేట్ అవుతుండటమే ఈ పరిస్థితికి కారణంగా తెలుస్తోంది.

- సజ్జలు మార్కెట్‌కు 130 క్వింటాళ్లు రాగా కనిష్ట ధర రూ.1,949, గరిష్ట ధర రూ.2,069 లభించింది.
- వేరుశనగ మార్కెట్‌కు 1,820 క్వింటాళ్లురాగా కనిష్ట ధర రూ.2,789, గరిష్ట ధర రూ. 6,866.. సగటు ధర రూ.5,296 నమోదైంది.
- ఆముదం ధర కూడా తగ్గిపోయింది. మార్కెట్‌కు990 క్వింటాళ్లు రాగా కనిష్ట ధర రూ.3,636, గరిష్ట ధర రూ.5,976.. సగటు ధర రూ.5,809 లభించింది.
- కొర్రల ధర సైతం పడిపోయింది. మార్కెట్‌కు 232 క్వింటాళ్ల కొర్రలు రాగా కనిష్ట ధర రూ.2,269, గరిష్ట ధర రూ.2,909.. సగటు ధర రూ.2281 నమోదైంది.

గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌కు 31 నామినేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో ఎన్నికల అధికారి డాక్టర్ దుర్గాప్రసన్న బాబు నామినేషన్లు స్వీకరించారు. 12 మంది డైరెక్టర్లను ఎన్నుకునేందుకు 31 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 29 మంది జనరల్ అభ్యర్థులు, ఒకరు ఎస్సీ, మరొకరి ఎస్టీ అభ్యర్థి ఉన్నారు. ఈ నామినేషన్‌లను 7వ తేదీన పరిశీలిస్తారు. 8న ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అదే రోజును తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. పోటీ అనివార్యమేతే ఈ నెల 22న పోలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 వాహనాలు సీజ్



వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు : మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ 11 మంది ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సి.క్యాంప్‌లో ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న తన సిబ్బందితో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. 11 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను ఈ సందర్భంగా సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో వారు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేసీకి 2265 క్యూసెక్కుల నీరు విడుదల

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిపై నిర్మించిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి (సుంకేసుల బ్యారేజీ) బ్యారేజీకి ఎగువ నుంచి 2,280 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం డ్యాం నుంచి కేసీ కెనాల్‌కు 2,265 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీలో 1.235 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

WANTED
Telecaller (Office Work) and Field Manager గా పని చేయుటకు ఆసక్తి గల యువతీ/యువకులు కావలెను.
Qly: Inter/Degree, Age: 24-40, Salary 10K-20K
Interview Dates : 7, 8, 9 Oct 2024
Smart India Associates Skandhanshi Business Centre, Bangarpet, Kurnool
Cell: 95022 06149, 91212 18437

మాచాపురంలో విషాదం

- నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి
- శోకసంద్రంలో బాధిత కుటుంబాలు





నీటి గుంతలో పడి మృతి చెందిన హనుమేష్,ఉదయ్‌కిరణ్ మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

నందవరం: ఓ నీటి గుంత ఇద్దరు చిన్నారుల ప్రాణాలు తీసుకుంది. బాధిత కుటుంబాల్లో విషాదం నింపిన ఈ ఘటన నందవరం మండలం మాచాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మృతులిద్దరు పదేళ్లలోపు వారే. ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బోయ భీమశేఖర్, రామలక్ష్మీలకు ఇద్దరు సంతానం. ఇందులో మొదటి కుమారుడు హనుమేష్ (6) 1వ తరగతి చదువుతున్నాడు. అలాగే నడిపి రంగస్వామి, ఉరుకుందమ్మలకు ఇద్దరు సంతానం. అందులో మొదటి కుమారుడు ఉదయ్‌కిరణ్ (10) 6వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు ఇవ్వడంతో పిల్లలను ఇంటి వద్దే ఉంచి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో హనుమేష్, ఉదయకిరణ్.. చరణ్, వంశీ అనే మరో ఇద్దరు చిన్నారులతో కలిసి బీవీ కాలనీ సమీపంలో అంపయ్య పొలం వద్దకు బహిర్భూమికి వెళ్లారు. అక్కడే ఓ పెద్ద గుంతలో ఇటీవల కురిసిన వర్షం నీరు నిల్వ ఉంది. ఆ నీటితో శుభ్రం చేసుకోవడానికి గుంత వద్దకు వెళ్లిన హనుమేష్ ప్రమాదవశాత్తూ జారి అందులో పడిపోయాడు. గమనించి రక్షించడానికి వెళ్లిన ఉదయకిరణ్ కూడా ఆ నీటిలోనే మునిగిపోయాడు. వెంటనే మిగతా ఇద్దరు చిన్నారులు పరుగెత్తుకుంటూ వచ్చి గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ఇద్దరు చిన్నారులను నీటి గుంతలో నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై నందవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనుకోకుండా ఇద్దరు చిన్నారులు నీటి కుంటలో పడి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

పండుగకు వెళ్లి..

- ప్రమాదవశాత్తూ వాగులో పడి బాలుడు మృతి



సంపత్ కుమార్(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో ప్రమాదశాత్తు వాగులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఎస్. నాగలాపురం గ్రామానికి చెందిన మాణిక్యరావు, శాంతకుమారికి సంపత్ కుమార్(12), కృప, అబ్బుత్‌కుమార్ సంతానం. పుట్టినిల్లు పార్లపల్లి గ్రామంలో కోతరాళ్ల పండుగ ఉండటంతో పిల్లలతో కలిసి శాంత కుమారి ఊరికి వచ్చింది. శనివారం బంధువుల పిల్లలు సందీప్, జగన్‌లతో కలిసి సంపత్‌కుమార్ ఎర్రకోట గ్రామ రోడ్డువైపు బహిర్భూమికి వెళ్లాడు. తర్వాత అక్కడే ఉన్న వాగులో కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లిన సంపత్‌కుమార్ (12) ప్రమాదవశాత్తూ జారి అందులో పడిపోయాడు. గమనించిన మరో ఇద్దరు చిన్నారులు గట్టిగా కేకలు వేస్తూ ఇంటికి పరిగెత్తుకొచ్చి కుటుంబ సభ్యులకు చెప్పారు. వారు వెంటనే వాగు దగ్గరకు వెళ్లి గాలించి బయటకు తీసి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పండుగ కోసం వెళ్లి కుమారుడిని కోల్పోవడంతో తలిదండ్రులు బోరున విలపించారు. ఈ ఘటనపై బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రెండో పటాలంలో బదిలీల రచ్చ

- ముఖ్య విభాగాలకు దరఖాస్తులు కోరిన ఇన్‌చార్జి కమాండెంట్



కర్నూలు రెండో బెటాలియన్ పరిపాలన కార్యాలయం

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో సిబ్బంది బదిలీల వ్యవహారం దుమారం రేపుతోంది. కొందరు రూ.20 వేల నుంచి రూ.50 వేలు కుమ్మరించి కోరుకున్న పోస్టింగ్‌లు దక్కించుకున్నారు. ఈ వ్యవహారంలో ఆర్ఐ, హెడ్ కానిస్టేబుల్ చక్రం తిప్పి భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఏపీఎస్పీ రెండో పటాలంలో బది'లీల'లు శీర్షికన 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఆ విభాగం రేంజ్-3 ఇన్‌చార్జి డీఐజీ రాజకుమారి స్పందించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు బదిలీలను నిలుపుదల చేయాలని ఆదేశిస్తూ ఇన్‌చార్జి కమాండెంట్ ప్రభుకుమార్‌కు ఆన్‌లైన్ ద్వారా రెండు రోజుల క్రితం మెమో జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం వసూల్‌రాయుళ్లకు మింగుడుపడటం లేదు. కమాండెంట్ రవిశంకర్ గత నెల 30న పదవీ విరమణ పొందారు. అందుకు ఒక్కరోజు ముందు 11 మంది ఏఆర్ ఎస్ఐలు, 25 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 64 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. అయితే బయటి కంపెనీల్లో పనిచేస్తూ అధికారులకు ముడుపులు ఇచ్చి హెడ్ క్వార్టర్ కంపెనీకి బదిలీ చేయించుకున్నారనే ఫిర్యాదులపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతుండటం సిబ్బందిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పటాలంలో పనిచేసే సిబ్బందికి టర్న్ ప్రకారం హెడ్ క్వార్టర్ విధులకు అవకాశం కల్పించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఫిర్యాదుల నేపథ్యంలో పటాలంలోని ముఖ్య విభాగాల్లో పనిచేసేందుకు ఇన్‌చార్జి కమాండెంట్ ప్రభుకుమార్ శనివారం మెమో జారీ చేశారు. సి-కంపెనీలో పనిచేస్తున్న ఏఆర్ ఎస్ఐ వైఆర్ మద్దిలేటి ప్రస్తుతం పటాలంలో ఉన్న క్యాంటీన్ నిర్వహణ వ్యవహారాలను చూస్తున్నారు. అలాగే హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి జి-కంపెనీ సీసీగా వ్యవహరిస్తున్నారు. మరో హెడ్ కానిస్టేబుల్ ఎం.నాగన్న హెడ్ క్వార్టర్‌లోని పోలీస్ గెస్ట్‌హౌస్ (అతిథి గృహం) నిర్వహణను చూస్తున్నారు. కానిస్టేబుల్ మల్లికార్జున హెడ్ క్వార్టర్‌లోని క్యాంటీన్ విభాగంలో, హెడ్ క్వార్టర్‌లోని సీఎంటీ కార్యాలయంలో బి.పి.గిడ్డయ్య, గెస్ట్‌హౌస్‌లో కె.ప్రభాకర్ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో జరిగిన అవకతవకలు, కొందరు సిబ్బందిపై ఆరోపణల నేపథ్యంలో వారిని కూడా ఆయా స్థానాల నుంచి తప్పిస్తున్నట్లు ఇన్‌చార్జి కమాండెంట్ జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు. ఆయా విభాగాల్లో సేవలందించేందుకు ఆశావహులు (పటాలం సిబ్బంది) దరఖాస్తు చేసుకోవాలని మెమో విడుదల చేయడంతో బదిలీల వ్యవహారం మరింత జఠిలంగా మారింది.

బస్సు ఢీకొని యూపీ వాసి మృతి



ప్రమాదంలో మృతిచెందిన విజయరావు

కర్నూలు: స్థానిక కొత్తబస్టాండ్ ఔట్ గేట్ (బస్సులు బయటకు వచ్చే దారి) వద్ద బస్సు ఢీకొన్న ఘటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. యూపీకి చెందిన విజయరావు (55) కొద్ది రోజుల క్రితం ఉపాధి నిమిత్తం కర్నూలుకు వలస వచ్చాడు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ వద్ద కార్మికుడు (కూలీ)గా చేరాడు. శుక్రవారం అర్ధరాత్రి కొత్తబస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా కర్నూలు నుంచి బనగానపల్లెకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా క్యాజువాలిటీలో చికిత్స పొందుతూ కోలుకోలేక తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని సమాచారం సేకరించారు. మృతుని బంధువులు సికింద్రాబాద్‌లో ఉన్నట్లు తేలడంతో ఫోన్‌లో సమాచారం చేరవేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

ముగిసిన ఆర్‌యూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

- విజేతలుగా సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కబడ్డీ), రామకృష్ణ డిగ్రీ కళాశాల (చెస్)



కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ నాయక్

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా నగరంలోని రామచంద్రనగర్‌లోని సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల క్రీడా పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలుగా సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల (కబడ్డీ , కర్నూలు), రామకృష్ణ డిగ్రీ కళాశాల (చదరంగం, నంద్యాల) జట్లు నిలిచాయి. కబడ్డీలో శ్రీ లక్ష్మి బీపీఈడీ కళాశాల ద్వితీయ స్థానం, సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల తృతయ స్థానం, అలాగే మహిళల చదరంగం పోటీల్లో సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, వెంకాయపల్లె రోడ్డులోని సెయింట్ జోసఫ్ మహిళా డిగ్రీ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ ముగింపు కార్యక్రమానికి రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎన్‌టీకే నాయక్ అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి మాట్లాడారు. యువతులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, ఆర్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ శివకిషోర్, సాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జానీబాషా పాల్గొన్నారు.

8న జాబ్ మేళా

కర్నూలు సిటీ: స్థానిక బిర్లాగేటులోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న న్యాక్ శిక్షణ కేంద్రంలో ఈ నెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి ఎల్.ఆనంద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్, అనంత ప్రాజెక్ట్స్ అండ్ టెక్నికల్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, పేరాస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఏదైనా డిగ్రీ, పీజీ చదివి 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ మేళాకు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి 20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. హాజరుకావాలనుకునే వారు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 96761 41731, 90592 90821 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు 'రవ్వల సడి' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి వెంకట కృష్ణ రచించిన రాయలసీమ కవుల కవిత్వ వ్యాసాల సంకలనం 'రవ్వల సడి' ఆవిష్కరణ సభ ఆదివారం ఉదయం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణియాదవ్ తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె.సుభాషిణి, రచయిత డాక్టర్ అంకె శ్రీనివాస్ అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి సమీక్షిస్తారని పేర్కొన్నారు.

ఎర్రమట్టి కొండ కరిగిపోతోంది!

- ఆగని మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



టి.లింగందిన్నె సమీపంలో తిప్పను తవ్వి టిప్పర్‌లో మట్టి నింపుతున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె, టి.లింగందిన్నె గ్రామాల మధ్య తిప్ప (కొండ)పై ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎలాంటి అనుమతి లేకుండా పెద్ద పెద్ద టిప్పర్లలో సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్రమార్కుల దెబ్బకు సహజసిద్ధమైన కొండ మొత్తం కరిగిపోతున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నాయకుల కళ్లు కొండ తిప్ప మీద పడ్డాయి. కొన్ని నెలలుగా అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. తవ్విన మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, ఈ దందాపై ఇటీవల పత్రికల్లో కథనాలు రావడం..మైనింగ్ అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేయడంతో మట్టి తవ్వకాలకు కాస్త విరామం ఇచ్చి మళ్లీ ఇప్పుడు మొదలు పెట్టారు. భారీ టిప్పర్ల రాక పోకలతో రైతులు పొలాలకు వెళ్లే దారులు దెబ్బతిన్నాయి. అడుగడుగునా గుంతలు పడి వర్షం నీరు నిలిచిపోతుంది. ఇది వరకు సహజసిద్ధమైన తిప్పపై పశువులను మేపుకునేవారమని, తవ్వకాలు మొదలైనప్పటి నుంచి కొండపై గ్రాసం అనేది కను చూపు మేరలో కనిపించకుండాపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. మట్టి తవ్వకాలపై తహసీల్దారు మల్లికార్జున ప్రసాద్‌ను వివరణ కోరగా తాము ఎవ్వరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఇటీవల ఓ టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని రూ.5వేలు జరిమానా విధించామన్నారు. తిప్పపై మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



లారీల రాకపోకలతో గుంతల మయంగా దారి

టెట్‌కు 168 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: జిల్లాలోని ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు శనివారం 168 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 635 మందికిగాను 547 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 630 మందికిగాను 550 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. కర్నూలు నగరంలోని ఓ పరీక్ష కేంద్రం దగ్గర ఓ అభ్యర్థి అస్వస్థతకు గురయ్యారు. పరీక్ష రాసి బయటకు వచ్చే సమయంలో కళ్లు తిరిగి కింద పడటంతో అక్కడే ఉన్న ఏఎన్ఎం ప్రథమ చికిత్స చేసి జనరల్ ఆసుపత్రికి తరలించారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



తప్పిపోయిన మంగళి వీరేష్

కర్నూలు: నగరంలోని బి.క్యాంప్ పోస్టాఫీసుకు ఎదురుగా బిర్లాగడ్డలో నివాసముంటున్న మంగళి వీరేష్ (19) మతిస్థిమితం లేక తప్పిపోయాడు. ఈనెల 3వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో అందరూ పడుకుని ఉండగా ఎవరికీ చెప్పకుండా బయటకెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల కాలనీల్లో గాలించినా కనిపించలేదు. దీంతో వారు శనివారం పోలీసులను ఆశ్రయించారు. 5.6 అడుగుల ఎత్తు ఉంటాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు బ్లూ, పసుపు రంగు గల ఆఫ్ టీషర్టు, నశ్యం కలర్ ప్యాంట్ ధరించాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

నేషనల్ హైవే పనులు వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్) : నేషనల్ హైవే పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారుల పనుల పురోగతిపై నేషనల్ హైవే అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 40 భూసేకరణకు సంబంధించిన నష్ట పరిహారాన్ని వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌హెచ్ 340సికి సంబంధించి పసుపుల, రుద్రవరం గ్రామాలకు సంబంధించిన క్లెయిమ్స్ త్వరగా పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎన్‌హెచ్ 340బి సోమయాజుల పల్లె నుంచి డోన్ రూట్‌కి సంబంధించిన క్లెయిమ్స్‌ను, ఎన్‌హెచ్ 167కి సంబంధించి ఆదోని బైపాస్ క్లెయిమ్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా మంత్రాలయం బైపాస్‌కి సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఇవ్వాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ 340సి కి సంబంధించి బి.తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులను నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అదే విధంగా గార్గేయపురం గ్రామానికి సంబంధించి మిస్సింగ్ ఎక్సటెన్ట్ ఆఫ్ 3డిని అధికారులు ఎన్‌హెచ్ వారికి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్డీవో సందీప్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

AUTOMOBILES

M.S.R ఆటో కన్సల్టెన్సీ: 15సం॥లు పైబడిన అన్ని రకముల వాహనములు, ఎంత పాతవైనా, ఇంజన్ సీజ్ అయినా కొనబడును. Note: ఒరిజినల్ రికార్డ్స్‌తో సంప్రదించగలరు. ✆ 95537 70909, 93928 88275. [L-794935]

EDUCATION

ADMISSIONS

Degree Spot Admissions: BCA, BBA, B.com (CA), B.Sc (All groups). Sri Vijayadurga Degree College, Sri Nagar Colony, Kurnool-518002. Ph:- 9030628410, 9393728410, 9398122900 [L-796352]

REAL ESTATE

వేగంగా అభివృద్ధి చెందుతున్న కర్నూలు సిటీలో ప్లాట్లు, భూములు, ఇండ్లు కొనాలన్నా, అమ్మాలన్నా సంప్రదించండి: జె.వై.శాస్త్రి, సెల్: 96762 11033. [L-796561]

PLOT FOR SALE

కర్నూలు-పసుపుల గ్రామం బి.తాండ్రపాడు సర్వే నెం: 43, ప్లాటు నెంబర్ 304లో 5.1/2 సెంటు (40x60) అడుగుల స్థలం అమ్మకమునకు కలదు. సంప్ర: కె.పురుషోత్తం: 9392950888. [L-796353]

ఫ్యూచర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి న్యూ వెంచర్ అక్షయ డ్రీమ్ వ్యాలీ హుస్సేనాపురం ఊరు అనుకొని వివిధ వెంచర్ల మధ్యన తక్షణం ఇల్లు కట్టుకొనే అవకాశం కలదు. తక్కువ ధరకు ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 6300265849. [L-796572]

HOUSE FOR SALE

కర్నూలు మమతానగర్ ప్రక్కన భవాని నగర్‌లో 5.1/2 సెంట్లలో నిర్మించబడుతున్న G+3 బిల్డింగ్‌లో 2వ ఫ్లోర్‌లో 2 ఇండ్లు & 3వ ఫ్లోర్‌లో 1 ఇల్లు అమ్మబడును. ✆ 7981561643. [L-796573]

కర్నూలు టౌన్‌కి అతి సమీపములో కృష్ణవేణి ఐటిఐ కాలేజి మరియు పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజికి అతి దగ్గరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టమ్‌తో ఇండిపెండెంట్ హౌసెస్ అమ్మకానికి కలవు. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్ర: 98852 66558. [L-796571]

తూర్పు-ఉత్తరం కార్నర్, నూతనంగా నిర్మించిన Duplex House (G+2) Fullly furnished (3000 sft) నంద్యాల చెక్‌పోస్ట్ దగ్గర, వినాయక గుడి వెనుక భాగములో అమ్మకమునకు కలదు. Bedrooms 5 No.s, Halls 3No.s, Corridors 3No.s, Car Parking, Bore కలవు. సంప్రదించండి: 9440282771, 9703741054. [L-794926]

LEASE / RENT

GODOWNS FOR RENT : Two Scientifically Built Godowns of Each 3000 Sq Feet and 2000 Sq Feet For Lease/Rent. Industrial Estate, Phase-III, Kallur, Kurnool. Cell: 8919961876/9381082935. [L-796354]

DHANUNJAYA VARMA COMPLEX, 120FT BELLARY MAIN ROAD. FACING-6 SHOPS-(W-72FTxL-57FT=4100sq.ft) LEASE/RENT-BEST FOR BANKS, SHOW ROOMS, COMMERCIAL OFFICE SPACE ETC, CONT: 9393866399, 9440457679. [L-783345]

గుత్తి హైవే రోడ్డుకి దూపాడు రైల్వే స్టేషన్ ప్రక్కన 60 వేల నుంచి 65 వేల చదరపు అడుగులలో గోడౌన్ నిర్మించి లీజుకు ఇవ్వబడును. ఆసక్తి గలవారు సంప్ర: 98859 06662 [L-794930]

TO - LET

Place For Rent Only For Parking Vehicles at N.R.Peta, Kurnool. Hospitals And Schools or Individuals Can Contact: 94410 30151. [L-796576]

2300 Sqft Shed for Rent Near & Behind Vaartha Office, Nandikotkur Road, Vasavi Nagar, Kurnool. ✆ 9949004902, 7799273030. [L-794934]

BUILDING FOR SALE

G+1 Building Sale Face NH 44, Kurnool Adj Maruthi Flat 6 Shops Suiting Commercial Auto Nagar. ✆ 9440703783, 9985138260 [H-804867]

SERVICES

HEALTH CARE

PHYSICIAN

డా॥కె.చంద్రమౌళీ రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ ఫిజిషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, అడ్రస్: శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [L-796565]

GENERAL & LAPROSCOPIC SURGEON

KGN మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, KVR గార్డెన్, వడ్డేరి, కర్నూలు. ఆరోగ్య శ్రీ ద్వారా అపెండిక్స్, మొలలు, హెర్నియా, థైరాయిడ్, కాలికి క్లోమాలు, ఆర్థోపెడిక్, యూరాలజీ, ENT, సర్జికల్ గ్యాస్ట్రో, మొ॥ శస్త్ర చికిత్సలు చేయబడును. ✆ 9346348653 [L-796563]

AYURVEDIC

డా॥M.మహిపాల్, M.S.,(AYU) ఫైల్స్, ఫిస్టులా, ఫిషర్‌కు ఆయుర్వేద క్షార సూత్ర ద్వారా శాశ్వత పరిష్కారం. ప్రతి నెల 2వ మరియు 4వ ఆదివారం చూడబడును. శ్రీ వెంకటసాయి ఆయుర్వేదిక్ హాస్పిటల్, వి.ఆర్.కాలనీ, కర్నూలు. ఫోన్ 99599 49739. [L-783332]

ORTHOPEDIC SURGEON

డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. ✆ 08518 - 228666, 83412 98666. [L-783319]

GYNECOLOGY

డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు.✆ 88970 87874 [L-796564]

UNANI

దీర్ఘకాలిక క్యాన్సర్, కిడ్నీ స్టోన్స్ మరియు చిన్న పిల్లల పోలియో వ్యాధులకు యునాని మందుల ద్వారా చికిత్స చేయబడును. సంప్ర: M.D.షఫీ హకీమ్, కర్నూలు. సెల్: 93970 11918 [L-783334]

VASTHU

మీ ఇల్లు చూసి అంత కొలచి వాస్తు మార్పులు చెప్పబడును. కొత్త ఇంటి ప్లానులు 100% గ్యారంటీ ఇవ్వబడును. మీఇల్లుపూర్తయ్యే వరకు అందుబాటులో ఉండగలము. గౌరు వాస్తు యం. మన్నెయ్య 9640964570 [G-782813]

WANTED

బ్రిడ్జి చెస్ అకాడమీలో చెస్ నేర్పించడానికి అసిస్టెంట్ కోచ్ కావలెను. & చెస్ హోమ్ క్లాసెస్, ఆన్‌లైన్ క్లాసెస్ కలవు. సంప్ర: ఎ.క్యాంప్, కర్నూలు. సెల్: 9110725597. [L-796574]

Wanted Experienced CRM, Accountant, Telecallers, Sales Executive (M/F), Min.Degree, 1 Year Experience in Automobile Field. R&M Suzuki, Bangarupeta, Kurnool. Cell: 6302805829. [L-796577]

Wanted Lady Supervisors, Pharmacist with certificates, Cath Lab Scrub Nurses, Cath Lab Technicians, OT Assistant, Contact: SRI VIJAYADURGA CARDIAC CENTRE, Gayathri Estates, Kurnool. Cell: 95029 23838, 86986 05193. [L-783346]

మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V- 6570]

మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ ప్రతి రోజు 500 పేమెంట్. వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి వివరాలకు కాల్ చేయండి. 8247808801 [M-1185300]

C Govt అగ్రికల్చర్ ప్రాజెక్టు కొరకు ఫీల్డ్ వర్కర్స్, మండల పార్టనర్స్ M/F కావలెను, అ: 10th టు డిగ్రీ, Age: 20+ ఆండ్రాయిడ్ ఫోన్ మరియు కంప్యూటర్ నాలెడ్జ్, Comis: upto 50K P/m, Cont.: ✆: 63024 97169, 70329 29146, 94949 43318 [R-6998]

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD.8317512135 [HA-98651]

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 9912011899 [SCA-24000293]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.